జెఇఇలో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని డిజిఎం రామమోహన్‌రెడ్డి, డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, ఎంజిఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి తెలిపారు. పి.బృహతి 99.77 శాతం, సి.హితేష్‌రెడ్డి 99.26, బి.జాగృతి 99.16, కె.మేఘనరెడ్డి, 98.96, వినయ్ రెడ్డి 98.66, ఎం.హసిని 98.62, సి.సాయి వైష్ణవి 97.99 శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో విజయం సాధించామని తెలిపారు. కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపిలో టికెట్ల వేట

- రాయచోటిలో ఒకరు భారీ డిన్నర్, మరొకరు ట్వీట్లు
- కడప, జమ్మలమడుగుల్లో ప్రచార జోరు
- ప్రొద్దుటూరులో గ్రూపుల పోరు
- మిగిలిన చోట్ల ఎవరి దారి వారిదే
- అధికారిక ప్రకటన కోసం నిరీక్షణ

టిడిపిలో టికెట్ల పోరు పతాకస్థాయికి చేరుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ ఆశావహుల్లో అలజడి నెలకొంది. టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు జనసేన, బిజెపి పొత్తుల్లో తలమునకలైన నేపథ్యంలో ఎవరి టికెట్‌కు ఎసరు వస్తుందోనని, ఎవరికి ఎగనామం పెరుకుతారోననే తెలియని గందరగోళ వాతావరణం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో ఉమ్మడి కడప జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ఇందులోభాగంగా టిడిపి నేతల్లో కొందరు భారీ డిన్నర్లు, మరొకరు తనకే టికెట్ వచ్చిందని, మరొకరు గుంభనంగా ప్రచారం నిర్వహిస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది. మరి కొన్ని అసెంబ్లీల్లో టికెట్లు ప్రకటించక మునుపే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడం వంటి వ్యూహాత్మక ఎత్తుగడలతో ముందుకు సాగుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు నేడో, రేపో విడుదల చేయనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచార నిర్వహణకు, అసంతృప్తులను బుజ్జగించడానికి సమయం తక్కువగా ఉండే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు టికెట్ల కోసం సిగ పట్లు పట్టడం ఆసక్తిని కలిగిస్తోంది.

రసవత్తరంగా రాయచోటి రాజకీయం

రాయచోటి నేతలు వ్యూహాత్మక ఎత్తుగడల్లో నిమగ్నమయ్యారు. మాజీ ఎమ్మెల్యే ద్వారక నాథరెడ్డి భారీ డిన్నర్ నిర్వహించడం ద్వారా టిడిపి కార్యకర్తలను సమీకరించుకోవడం, అసంతృప్తులను బుజ్జగించడం వంటి ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఇదేతరుణంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధిష్టానం నుంచి తనకే టికెట్ లభించిందని సమాచారం ఉందనే ప్రచారంతో కేడర్ సంబరాలు చేసుకుంటున్న వైనం ఆసక్తిని కలిగిస్తోంది. ఇంకొకరు మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌రెడ్డి తనదైన శైలిలో ఎన్నికల ప్రచారంతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న వాతావరణం నెలకొంది. రాజంపేటలో ఇన్‌ఛార్జి, సీనియర్ నాయకులు బత్యాల చెంగల్రాయుడు, ఇటీవలే తెరపైకి వచ్చిన పారిశ్రామికవేత్త సుగంట నరహరి, విద్యావేత్త జగన్మోహన్‌రాజు మధ్య టికెట్ పోటీ నెలకొంది. ముగ్గురు ఆశావహులు నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి కేడర్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుండడం గమనార్హం. కడపలో టిడిపి నేతల్లో గందరగోళం నెలకొంది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుని సతీమణి ఆర్. మాధవీరెడ్డి టికెట్‌పై భరోసాతో నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. ప్రత్యర్థులైన సీనియర్ నాయకులు అలంఖాన్‌పల్లి లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు సైతం తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది. వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే, డిప్యూటీ సిఎం అంజాద్‌బాషాపై హాట్ కామెంట్లతో రాజకీయాలను రసవత్తరంగా మార్చేయడం తెలిసిందే. కమలాపురం ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డికి టికెట్ స్పష్టత లేకపోవడంతో నిరీక్షిస్తుండడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి జనసేన పార్టీలో చేరి టికెట్ ఆశిస్తుండడంతో కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. ప్రొద్దుటూరు బరిలో నలుగురు ఆశావహులతో హైటెన్షన్ రాజకీయం నడుస్తోంది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులరెడ్డి భరోసాతో యువ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రధాన ఆశావహునిగా మారడం ప్రత్యర్థుల్లో గుబులు రేగుతోంది. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి టికెట్ తనదేనని, పార్టీ కోసం రూ.300 కోట్లు మేర నష్టపోయాయని పేర్కొనడం ద్వారా ప్రధాన పోటీదారునిగా మారడం గమనార్హం. ఈయనతోపాటు సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి టికెట్ ఇస్తే పోటీ చేస్తాననే ధోరణి వ్యక్తం చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ముగ్గురికితోడు నేను సైతం అంటూ సి.ఎం సురేష్ సైతం టికెట్ ఆశా వహుల్లో ఒకరుగా ఉండడం ఎనలేని ఆసక్తిని కలిగిస్తోంది. జమ్మలమడుగులో టిడిపి టికెట్ ప్రధాన ఆశావహునిగా భూపేష్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. యువ కుడు, సౌమ్యునిగా ముద్రపడడంతో ఆశావహ వాతావరణం ఏర్పడింది. ఇంతలో జనసేన, బిజెపి పొత్తు నేపథ్యంలో మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేయడానికి అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. టిడిపి అభ్యర్థుల్లో గెలిచే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఇటువంటి ఊహాగానాలను వదలడం చికాకు పరుస్తోంది. ఇటు వంటి తరహా వాతావరణం రాజంపేటలోనూ నెలకొంది. ఇక్కడ టిడిపి గట్టి అభ్యర్థిని నిలిపితే గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే అంచనాలు ఉన్నాయి. ఇటువంటి చోట జనసేన, బిజెపికి ఇస్తే టిడిపి ఖాతా తెరడం కష్టమేననే వాదన వినిపిస్తోంది. ఏదే మైనా జనసేన, బిజెపి అలయెన్స్ కారణంగా టిడి పి, మిత్రులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయనే వాదన విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది.

పేదల కాలనీల్లో
మౌలిక వసతులు కల్పించాలి

- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నాలో సిపిఎం డిమాండ్
- పేదలను పట్టించుకోని పాలకులకు రాబోయే ఎన్నికల్లో బుద్ధిచెప్పాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాలనీల పేదలు

ప్రజాశక్తి - బద్వేలు

పేదలు నివాసముంటున్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ యార్డ్ నుంచి బద్వేలు ఆర్‌డిఒ కార్యాలయం వరకు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేలు పట్టణంలోని సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతిబాసు కాలనీ ఏర్పడి నేటికీ 20 సంవత్సరాలు పూర్తవుతున్న అక్కడి మూడు కాలనీలలో నివాసం ఉంటున్న సుమారు 4వేల కుటుంబాల వారికి కనీస మౌలిక సౌకర్యాలు మంచినీరు, రోడ్లు, కరెంటు, రేషన్ కార్డులు, ప్రభుత్వ నవరత్నాలు సంక్షేమ పథకాలు, జగనన్న బిల్డింగులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డోర్ నెంబర్లు, ఇంటి పట్టాలు, కనీసం అనుబంధ ఫారాలు, శ్మశాన వాటికలు ఏర్పాటు చేయలేదని వారు విమర్శించారు. ఓటు కార్డులు, ఆధార్ కార్డులు, వికలాంగుల, వితంతు, వృద్ధాప్య పెన్షన్లు ఏ ఒక్కటి కూడా సక్రమంగా అందరికీ అందడం లేదని వారు అన్నారు. బద్వేల్ మున్సిపాలిటీలోని మున్సిపల్ పాలకవర్గం కానీ, బద్వేల్ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీలు కానీ ఎన్నికల అప్పుడు వచ్చి వాగ్దానాలు ఇచ్చి వెళ్ళారని, తరువాత పట్టించుకున్న పాపాన పోలేదని, ఒక్క సిపిఎం మాత్రమే అక్కడి పేద ప్రజల కష్టాలలో, బాధల్లో, ఇబ్బందుల్లో, నష్టాల్లో వారితో ఉండి వారికి అండగా నిలుస్తోందని గుర్తు చేశారు. భారత రాజ్యాంగంచే ఏర్పడిన పేదల అనుకూల చట్టాలు ఎక్కడికి పోయాయో, ఎందుకు అమలు చేయడం లేదో, పాలకులు, అధికారులు ప్రజలకు జవాబుదారీగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. చదువు లేని పేదలను పేదరి కంలోనే తరతరాలుగా ఉంచు తున్న, వారి సంక్షేమం, విద్య, వైద్యం, గృహాలు, ఉపాధి పట్టించుకోని పాలక ప్రభు త్వాలకు, 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. పేదలందరూ ఐక్యంగా వారి సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆపకూడదని, పోరాటం ద్వారానే ముద్దు నిద్రపోయే ప్రభుత్వాల నిద్ర లేపాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు బి.మనోహర్, పట్టణ కార్యదర్శి కె.శ్రీనివాసులు, బద్వేలు పట్టణ కమిటీ సభ్యులు పి.చాంద్ బాషా, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని, సిపిఎం నాయకులు పి.సి.కొండయ్య, ఆంజనేయులు, జి.నాగార్జున, మోక్షమ్మ, అనంతమ్మ, మస్తాన్ బి, రామ లచ్చుమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

పట్టణంలో ప్రదర్శనగా వస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

పాత పెన్షన్‌పై పార్టీల వైఖరి తెలపాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ అనంతరం సమాజంలో గౌరవప్రదంగా జీవించడానికి పాత పెన్షన్ విధానం అవసరమని, అలాంటి పాత పెన్షన్ పై రాజకీయ పార్టీల వైఖరేంటో తెలపాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. మంగళవారం సాయంత్రం కడపలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్‌ను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భవిష్యత్తును నిర్ణయించేది తాము ఎన్నుకున్న నాయకులే అయినా తమ సమస్యలు పరిష్కరించ లేనప్పుడు వారి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేది కూడా తమ ఓటే అనే విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. అందుకే ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో ఎవరైతే పాత పెన్షన్ ఇస్తామని మేనిఫెస్టోలో చేర్చి అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేస్తారో వారికే మా ఓట్లు, మా కుటుంబ సభ్యుల ఓట్లు వేస్తామని చెప్పారు. పాత పెన్షన్‌పై ప్రస్తుత ముఖ్యమంత్రి మాట తప్పి మడమ తిప్పారని ఎటువంటి హామీలు ఇవ్వని అనేక రాష్ట్రాలు పాత పెన్షన్ పునర్దరిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో పాత పెన్షన్ పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి అవకాశం ఉందని, ఉద్యోగ, ఉపాధ్యాయులపై మొండిగా ముందుకు వెళుతూ న్యాయబద్ధమైన సమస్యను పరిష్కరించపోతే ఈ ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఏ రాజకీయ పార్టీ అయితే పాత పెన్షన్ పై స్పష్టమైన హామీ ఇస్తుందో ఆ పార్టీకే మా మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహమ్మద్, నాయకులు గోపీనాథ్, అబ్దుల్ గని, హిపాజితుల్లా, సుజిత్ కుమార్, వీరనారాయణ పాల్గొన్నారు.

కో-కన్వీనర్‌గా పంద్రా రంజిత్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా జనసేన పార్టీ మొదటి కార్యకర్త పంద్రా రంజిత్ కుమార్‌ను జనసేన పార్టీ 2024 ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ రాయలసీమ జోనల్ 1 కమిటీ కో-కన్వీ నర్‌గా నియమితులయ్యారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్. 2024 ఎన్నికల సభలు నిర్వహణ సజావుగా సాగేం దుకు ప్రత్యేకంగా జోనల్ కమిటీలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా రాయలసీమ 1, 2 జోన్లుగా కమిటీలు వేశారు. జనసేన పార్టీలో 2014 నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న పంద్రా రంజిత్ కుమార్‌ను రాయలసీమ జోనల్ 1 ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ కమిటీ కో- కన్వీనర్ గా నియ మించారు. ఈ సందర్భంగా పంద్రా రంజిత్ కుమార్ మాట్లా డుతూ తన పైన నమ్మకం ఉంచి జనసేన పార్టీ 2024 ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ రాయలసీమ జోనల్ కమిటీ కోకన్వీనర్ గా నియమించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పవన్‌కళ్యాణ్, మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

18న నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 129వ సదస్సును ఈ నెల 18న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి. రామప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 129వ సదస్సులో 'డాక్టర్ వేంపల్లె షరీఫ్ జీవితం - సాహిత్యం' అనే అంశంపై కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ పొదిలి నాగరాజు ప్రసంగిస్తారని తెలిపారు.

16న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 16న సమ్మెలో భాగంగా పాత బస్టాండ్ నుంచి ఏడు రోడ్లు, గోకుల్ సర్కిల్, వన్ టౌన్, హెడ్‌పోస్ట్ ఆఫీస్, బిఎస్ఎన్ఎల్ వరకు నిర్వహించే సమ్మె ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్, దస్తగిరి రెడ్డి, అన్వేష్ మాట్లాడుతూ 2014 లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలను విపరీతంగా పెంచేసి, ప్రజల నెత్తిన భారాలు వేయడమే కాక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే దేశ సంపదను అంబాని, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా దోచిపెడుతుందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించిన నరేంద్ర మోడీ రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికుల హక్కులను కాల రాశారని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చారన్నారు. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దించేందుకు అన్ని వర్గాల ప్రజలు ఏకం అవ్వాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు సీటు 50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని తెలిపారు. కేరళ రాష్ట్ర విధానాన్ని అమలు చేయాలన్నారు. రైతుల రుణాలు మాఫీ చేసేందుకు రుణ ఉపశమన చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. కరువు తుఫాన్ నష్టపరిహారాలను, ఇన్పుట్ సబ్సిడీలను రైతులకు వెంటనే ఇవ్వాలని, రైతుల ందరికీ పంటల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించి, స్మార్ట్ మీటర్ల బిగించే విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె గ్రామీణ ప్రాంత బంద్ జయప్రదం కోసం జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాలలో నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరపత్రల ఆవిష్కరణలో సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి పాల్గొన్నారు. **కలసపాడు :** కార్మిక, రైతు వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే గ్రామీణ సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మస్తాన్, సగిలి గురయ్య, సునీల్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మేరీ, ప్రవీణ్, సుదర్శన్, నారాయణ, సల్మాన్ పాల్గొన్నారు.

వైవీయూలో ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం

కడప అర్బన్ : విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తాగునీటి సౌకర్యం కోసం వైవీయూలో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్‌ను విసి ఆచార్య సుధాకర్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, ఇంజినీర్ ఎం.రాజశేఖర్‌రెడ్డి, కె.రామచంద్ర రెడ్డి, వైవీయూ ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, ఆచార్యలు ఎం.వి.శంకర్, కె.ఎస్.వి. కృష్ణారావు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ శ్రీనివాసగౌడ్, ట్రాన్స్ పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేడియో సమాచార సాధనం

ప్రజాశక్తి- కడప అర్బన్

రేడియో ప్రజల హృదాయలను గెలుచుకున్న మంచి సమాచార సాధనమని కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి జాన్ దేవానంద్ అన్నారు. మంగళవారం జాతీయ రేడియో దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేడియో నేటికీ మంచి సాధన అన్నారు. రేడియో ఎంతో మంది జీవితాలను ప్రభావితం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మినారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని హృదయపేట లింగారెడ్డిపల్లిలో మంగళవారం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొజ్జ రోషన్న ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఒక్కరిని కలుస్తూ టిడిపి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు. బద్వేల్ నియోజవర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అందరి ఆశీస్సులు కావాలన్నారు. కార్యక్రమంలో కలసపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, టిడిపి నాయకులు, కొత్తపల్లి రంగారెడ్డి. రంగారెడ్డి, వెండిదండుల వెంకటరెడ్డి, మస్తాన్, మాజీ సర్పంచ్ బోయిల్ల, బాల వెంకట్ రెడ్డి, ఉప మండలాధ్యక్షులు సంధి రెడ్డి పట్టాభి రెడ్డి, రామ సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు చెంచయ్య గారి బాల వెంకట్ రెడ్డి, శేషయ్య, ఎల్లయ్య, రాములు, వెంకటరమణ, వెంకటయ్య, పోకల వెంకటయ్య, జనసేన యువనాయకులు రవిచంద్ర, కన్నయ్య, భద్రయ్య, లక్కాకుల వెంకటేశ్వర్లు మల్లికార్జున, రామాంజనేయ రెడ్డి, తంబళ్లపల్లి, నారాయణరెడ్డి, అంబారం సోమిరెడ్డి పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న ఎన్‌జిఒ నాయకులు

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని ఎపి జెఎసి జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం ఎన్‌జిఒ హోంలో సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్‌జిఒ నాయకులు తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఈ నెల 14 నుంచి ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమని తెలిపారు. నాలుగున్నర ఏళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ప్రభుత్వానికి ఎంతగా సహకరిస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవటంతో పోరుబాట పట్టక తప్పలేదని పేర్కొన్నారు. 14న తాలూకా, జిల్లాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్‌కు వినతిపత్రాలు, 15,16 మధ్యాహ్న భోజన సమయంలో నిరసన, 17న తాలూకాల్లో ర్యాలీ, ధర్నా, 20న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా, 21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు, జిల్లాలు తిరుగతూ ఉద్యమ కార్యాచరణను ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. 27న చలో అసెంబ్లీ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, డి.శ్రీనివాసులు, వెంకటరమరాజు, రాజగోపాల్‌రెడ్డి, రాజశేఖర్, నాగార్జున, గౌరి, జ్యోతి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కడప అర్బన్ : నగరంలో అభివృద్ధి పనుల్లో భాగంగా సర్కిల్స్, రోడ్డు వెడల్పు పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్, వై.జంక్షన్ రోడ్డు, అన్నమయ్య, కృష్ణ, గోకుల్, మాసపేట, మార్కెట్ యార్డ్ అల్మాస్‌పేట సర్కిల్స్, దేవునికడప రోడ్డు పనులను ఆర్‌అండ్‌బి, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి నిర్మాణ పనులు, నాణ్యతను పరిశీలించారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ఎపి దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ(ఎపిఎస్‌పిడిసిఎల్)లో ఎస్ఇగా బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన మోక్షగుండం వెంకటసుబ్బయ్య మంగళవారం తన స్వగృహంలోని 500 పుస్తకాలను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, సిబ్బంది నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ వెంకటసుబ్బయ్య బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో విజ్ఞాన దీపిక, తెలుగులో పరిశోధన(ఆం.ప్ర.సాహిత్య అకాడమి రజతోత్సవ సంచిక), అరుణాచల మాహాత్మ్యం, నవజ్యోతి శ్రీకరుణాకర గురు, ద వే ఆఫ్ ఇంటెలిజన్సి(జిడ్డు కృష్ణమూర్తి), ఆటోబయోగ్రఫీ ఆఫ్ యోగి తదితర గ్రంథాలున్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన మోక్షగుండం వెంకటసుబ్బయ్యను యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జి.హరిభూషణరావు, ఎన్. రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక హర్షం వ్యక్తం చేశారు.

మహిళా కళాశాలలో జాతీయ సెమినార్

ప్రజాశక్తి - కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్‌సిటి అకాడమీ సహకారంతో సంయుక్తంగా 'నాక్' గుర్తింపులో కొత్త సంస్కరణలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో జాతీయ సెమినార్ నిర్వహించారు. ప్రారంభ ఉపన్యాసాన్ని డాక్టర్ అనిల్‌కుమార్ ఇచ్చారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా బోధనలు, వాటికి అనుగుణంగా గుర్తింపు విధానాలు మారాలని చెప్పారు. ఉన్నత కళాశాలలు నాక్ అక్రిడిటేషన్ పొంది తీరాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, డాక్టర్ ఎం.జయలక్ష్మి, కృష్ణ కోయల్, డాక్టర్ పి.సచిదేవి, వినితేజ, హరిత, డాక్టర్ కె.శాలిని పాల్గొన్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న కూర్చీలు

జగనన్న సురక్షకు స్పందన కరువు

ప్రజాశక్తి - చెన్నూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షను మంగళవారం చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. రోగులు తక్కువ.. వైద్యులు ఎక్కువగా సామెతగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమం గురించి ముందుగా ప్రజలకు చెప్పకపోవడమే కారణమని పలువురు పేర్కొంటున్నారు. ప్రతిఒక్కరికీ కార్పొరేట్ వైద్యం అందించడమే ముఖ్యమంత్రి జగనోహన్ రెడ్డి ఆశయమని, కార్యక్రమాన్ని నీరు కారుస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఎవరూ సురక్ష కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శమిచ్చాయి. కార్యక్రమానికి స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడమూ చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో చిన్నూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, డాక్టర్ చెన్నారెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - కడప

ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటిస్తూ వాహనాలను నడపాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్ బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు మొదలగు అంశాలపై కడపలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ప్రజా రవాణాలో మహిళలకు రహదారి భద్రత, బస్సులలో మహిళల సీట్ల ప్రాధాన్యత, 354 ఏ ఐపిసి, 506 ఐపీసీ వంటి అంశాలను వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చును అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఎపిఎస్ ఆర్‌టిసి ఈడి వెంకటేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నసీం, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, కళాశాల ప్రిన్సిపల్ సలీం బాషా, లెక్చరర్స్, డ్రైవర్లు, ఎన్‌జిఒలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్

సరోజినీ నాయుడు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కడప

సరోజినీ నాయుడు సేవలు మరువలేనివని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ కొనియాడారు. మంగళవారం ప్రభుత్వ పురుషుల కళాశాలలో మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సరోజిని నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సరోజినీ నాయుడు సేవలను కొనియాడారు. స్వాతంత్ర పోరాట యోధురాలిగా రచయితగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తొలి మహిళా ప్రెసిడెంట్‌గా, తొలి మహిళా గవర్నర్‌గా సరోజినీ నాయుడు పటిమను వివరించి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ హక్కుల కోసం పోరాడుతూ మంచి పౌరులుగా తమను తాము మలుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ శివపార్వతి, కన్వీనర్ డాక్టర్ కల్పన, కో- కన్వీనర్ రాజేశ్వరి, డాక్టర్ సావిత్రి, అనిత, రాధిక, రేణుక, సునీత, మహిళా అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నాగరాజు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

18న నిరుద్యోగులతో ముఖాముఖి

కడప అర్బన్ : హరిత హోటల్‌లో ఈనెల 18న ఉదయం 10.00 లకు నిరుద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ద్వారకా టవర్స్‌లోని స్వగృహంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డితో కలిసి ముఖాముఖి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులు నోటిఫికేషన్లు రాక సంవత్సరాల తరబడి కోచింగ్ సెంటర్లలో, రూములలో మగ్గిపోతున్నారని పేర్కొన్నారు. అనేక సమస్యలతో యువత, నిరుద్యోగులు ఇబ్బందులుపడుతున్నారని చెప్పారు. వారికి తోడుగా నిలబడుందుకే సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నిరుద్యోగులు పాల్గొని వారి సమస్యల ను, అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు. సభకు హాజరైన ప్రతి నిరుద్యోగ విద్యార్థులకు 2023-24 కరెంట్ అఫైర్స్ పుస్తకం ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండలంలో టిడిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమంపై రఘునాథరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా వేంపల్లె పంచాయతీ వార్డుల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రెండు రోజుల్లో వేంపల్లె పంచాయతీలో టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే సమయంలో ముందే అక్కడి నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇచ్చే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో టిడిపికి మెజార్టీ వచ్చే దిశగా బూత్ ఇన్‌ఛార్జులు పని చేయాలన్నారు. అందరూ ఐక్యమత్యంగా ఉండాలన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి, నియోజకవర్గ మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, డివి సుబ్బారెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, రామగంగిరెడ్డి, తెలంగాణ వలి, జబీవుల్లా, వేమకుమార్, డక్కా రమేష్, వీరభద్ర, ఆర్ వి రమేష్, పూల అల్లాబక్ష్, ఈశ్వరయ్య, రామాంజనేయరెడ్డి, గోగుల మల్లికార్జున, పీర సాహెబ్ ఫయాజ్, కరీముల్లా, వెల్డింగ్ బాషా, మడక శ్రీనివాసులు, పిపి చెంద్రాయుడు, ఎస్సీ రమణ, ఆది, బత్తల రమణ, ఎద్దుల శేషారెడ్డి, రెడ్డి కిషోర్, శివ పాల్గొన్నారు.

నేటి నుంచి వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వ్యవసాయ రంగానికి సంబంధించి 9 గంటల విద్యుత్ బుధవారం నుంచి సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

ప్రయివేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాలోని ప్రయివేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిఇఒను కోరినట్లు ఆ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు తెలిపారు. డిఇఒగా బాధ్యతలు చేపట్టిన అనురాధను మంగళవారం ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను సమయపాలనను పాటించేలా చూడాలన్నారు. ప్రభుత్వ సెలవుల్లో క్లాసులు నిర్వహించకుండా చూడాలన్నారు. అధ్యక్షత ఒక్కరోజు ఉపాధ్యాయులపై తగ్గించాలన్నారు. పాఠశాలల కమిషనర్ గత అక్టోబర్ 17న జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధ్యక్షులు పోలిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

దొండ్లవాగు రమణమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణానికి చెందిన దొండ్లవాగు రమణమ్మ (52) సోమవారం రాత్రి మరణించడంతో ఆమె భర్త శ్రీనివాసులు, కుమార్తెలు శాంతి, శ్వేత, వైసిపి జగనన్న దళం వ్యవస్థాపకులు భవ్య దొండ్లవాగు నేత్రదానానికి అంగీకరించారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

నేడు చర్చి నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడు ఎస్సీ కాలనీలో బుధవారం ఉదయం సిఎస్ఐ చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఎంపిపి టి.లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ద్వారా రూ.12 లక్షలు నూతన చర్చి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపటిలోగా ఇ-క్రాప్ చేయించుకోవాలి

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 15 నాటికి రైతులు ఇ-క్రాప్, ఇకెవైసి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని బలపనూరు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. సోమవారం 'ప్రజాశక్తి' దినపత్రికలో 'ఆర్‌బికెల్లో సిబ్బంది కొరత' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించి జిల్లా వ్యవసాయ శాఖ జెడి, ముద్దనూరు వ్యవసాయ శాఖ ఎడి వెంకటసుబ్బయ్య ఆర్‌బికెలను పరిశీలించారు. అనంతరం జెడి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15 నాటికి (ఇక్రాప్) చేయించుకోవాలని సూచించారు. కొన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో సిబ్బంది కొరత కారణంగా పంట నమోదులో వెనుకబడి ఉన్నామన్నారు. సింహాద్రిపురం మండలంలో ఆర్‌బికెలకు సిబ్బంది లేనిచోట పులివెందుల, కొండాపురం మండలం వారిని ఇన్‌ఛార్జిగా నియమించామన్నారు. రైతులు ఆర్‌బికెలకు వెళ్లి పంట నమోదు, ఇకెవైసి చేసుకోవాలన్నారు.

ఆర్‌బికెలో తనిఖీ చేస్తున్న జెడి నాగేశ్వరరావు

క్రైం కార్నర్

రామమోహన్‌రెడ్డి హత్యకు దాయాదులే కారకులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని మల్లెగుడిపాడు గ్రామానికి చెందిన కుంచాల రామమోహన్‌రెడ్డి(28) హత్యకు దాయాదులే కారకులని పోలీసులు తెలిపారు. మృతుడు ఎంపిటిసి సభ్యుడు చదువుకుని ప్రస్తుతం ఇంటివద్దనే తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటిలో నుండి వెళ్లి తిరిగి రాలేదని అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ విద్యాసాగర్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు విచారణలో బ్రిడ్జి టౌన్‌లో సీసీ కెమెరాలు పరిశీలించి, కొంత మంది అనుమానితులను విచారించగా.. అదే గ్రామంలో ఉండే రామమోహన్‌రెడ్డికి, పెద్దమ్మ కొడుకులు కుంచాల గురివిరెడ్డి, కుంచాల వెంకటరెడ్డి లకు అనేది పాత తగాదాలు ఉండేవి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం రామ మోహన్‌రెడ్డి మద్యం సేవించి ఇంటికి పోతాండగా పెద్దమ్మ కొడుకులు పరిచయం ఉండే బద్వేల్‌కు చెందిన మరో ఇద్దరు, అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు కలిసి రామమోహన్‌రెడ్డిని మండలంలోని బూడాదా గ్రామ సమీపంలో అటవీలో రాయితో తలపై కొట్టారు. చనిపోయిన తర్వాత ట్రాక్టర్‌లో వేసుకొని వెళ్లి వంకమర్రి గ్రామ సమీపంలో పై తెలిపిన వెంకట రెడ్డి బొగ్గుల బట్టీ సమీపంలో మట్టిలో పూడ్చారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. హత్యకు పాల్పడిన వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రామమోహన్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

మూగ జీవాలపై దూసుకెళ్లిన లారీ

50 గొర్రెలు మృతి, మరో 40 గొర్రెలకు తీవ్ర గాయాలు - రూ.12 లక్షలు నష్టం

ప్రమాదంలో చనిపోయిన గొర్రెలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు/ జమ్మలమడుగు రూరల్

ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 50 గొర్రెలు మృతి చెందగా, మరో 40గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలిలా ఉన్నాయి.. జమ్మలమడుగు మండలం పి.బొమ్మేపల్లికి చెందిన చౌడయ్య తన కుమారుడితో కలిసి మేపుకని 170 గొర్రెలను తోలుకొని దువ్వూరుకు బయలుదేరారు. తెల్లవారుజామును 5.30గంటలకు పెద్దశెట్టిపల్లి వద్దకు చేరుకున్నారు. ఆ సమయానికి జమ్మలమడుగు వైపు నుండి వచ్చిన లారీ గొర్రెల మంద పైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో 60 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 40 గొర్రెలు తీవ్ర గాయాలపాలయ్యాయి. మిగిలిన గొర్రెలు చెల్లాచెదురుగా పరిగెత్తుకెళ్లాయి. మృతి చెందిన కొన్ని గొర్రెలను, గాయపడిన కొన్ని గొర్రెలను స్వార్థపూరిత చింతనతో అటువైపు వెళ్లే వాహనాల చోదకులు తీసుకెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.12లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ గునకనపల్లె రామనాథరెడ్డి, వైసిపి నేత ప్రతాప్‌రెడ్డి, బంధువులు, నాయకులు సంఘటనాస్థలం వెళ్లి బాధితులను పరామర్శించారు. ఎమ్మెల్యే మూలె సుధీర్‌రెడ్డి బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి జమ్మల మడుగు అభ్యర్థి భూపేష్‌రెడ్డి సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్‌రెడ్డి

పేదలకు అత్యుత్తమ వైద్యం : ఎంపిడిఒ

వైద్యశిబిరంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపిడిఒ మహబూబ్ బీ

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ మహబూబ్ బీ సూచించారు. మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని ప్రజలందరికీ వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం అన్ని రకాల వసతులతో కూడిన వైద్య సిబ్బందిని ప్రజల వద్దకే పంపుతోందన్నారు. డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వైసిపి నాయకులు నారాయణరెడ్డి, జయరాజు, సిహెచ్ఒ మహాదేవ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్ సరస్వతి, హెల్త్ అసిస్టెంట్స్ భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, సచివాలయ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మండలంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సోములవారిపల్లె నాలుగవ సచివాలయం ప్రజలకు పెన్నా నగర్ వికాస్‌స్కూల్ వద్ద కల్లూరు వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమన్ని నిర్వహించారు. వైద్యులు నాగార్జున, ఫర్జానా, అనూష, జి.చంద్రమౌళి కార్యక్రమంలో సేవలను అందించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరినాథ్, నూర్ అహ్మద్, నజీర్ అహ్మద్, సీహెచ్ఓ క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్ బి.ఎ.వరప్రసాద్, ఫార్మాసిస్టు శ్రీధర్, సీహెచ్ఓలు నరసింహ, నీనా రెచల్, దివ్య లక్ష్మి, అంజలి, శిరీష, గంగ తులసి, బేబీ గంగాధర్, నాగేంద్ర, హెల్త్ అసిస్టెంట్స్ సుబ్బయ్య, శ్రీనివాస్, లక్ష్మి, నారాయణ, ఆరోగ్య కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు, పైలెట్ ఉదయ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను పరిశీలిస్తున్న సీనియర్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

ఐఐటి, జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

విజయం సాధించిన విద్యార్థులతో బీరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్-2024 ఫలితాల్లో మండలంలోని బీరం జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో విజయఢంకా మోగించి 99 శాతానికిపైగా నలుగురు విద్యార్థులు, 98 శాతానికి పైగా ఆరుగురు విద్యార్థులు, 95 శాతానికి పైగా 11 విద్యార్థులు, 90 శాతానికిపైగా 17 మంది విద్యార్థులు పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, చైర్‌పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. బీరం కళాశాల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ బీరం కళాశాల ఐఐటి, నీట్ ర్యాంకులకు బ్రాండ్‌గా మారిందని తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడు మన కడప నగరంలో కూడా బ్రాంచ్‌ను స్థాపించామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హేమచందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయలసీమలో ఫ్యాక్షన్ జోన్ ఎందుకు..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాయలసీమలో ప్రస్తుతం ఎలాంటి ముఠా గొడవలు లేవని తక్షణమే ఫ్యాక్షన్ జోన్ ఎత్తేయాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆ మేరకు ఆయన మంగళవారం మైదుకూరు రోడ్డులో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 1980, 90 దశకాల్లో రాయలసీమలో రాజకీయాల కోసం హత్యలు గొడవలు ఉండేవన్నారు. అప్పటి అవసరాల దృష్ట్యా 1996లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఫ్యాక్షన్ జోన్ పెట్టారని తెలిపారు. ఇప్పుడు అలాంటిదేమీ లేదన్నారు. ఫ్యాక్షన్ జోన్ తీసేయాలని, ఆ పదాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. హత్యలు, గొడవలు, ముఠా కక్షలు అన్ని ప్రాంతాలు.. అన్ని దేశాల్లో ఉన్నా రాయలసీమకు మాత్రమే ఫ్యాక్షన్ అనే పదం వల్ల చాలా అనర్థాలు జరిగాయన్నారు. ఫ్యాక్షన్ అనే పదాన్ని నిషేధించి రాయలసీమ ప్రజలను గౌరవించేలా చూడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక యువత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాలుబాల మనోహర్ బాబు, రాయలసీమ విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు హరి పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

జగనన్న ఇళ్లకేనా మౌలిక వసతులు? : సిపిఎం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వైసిపి ప్రభుత్వంలో కేవలం జగనన్న ఇళ్లకే మౌలిక వసతులు కల్పిస్తారా అని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన ఇళ్లకు మౌలిక వసతులు అవసరం లేదా అని మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పేర్కొన్నారు. అమృత్‌నగర్‌లో లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పించాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా 22వ రోజు సత్యనారాయణ మాట్లాడుతూ 22 రోజులుగా ధర్నాలు, నిరసనలు, అంబేద్కర్ తదితర విగ్రహాలకు వినతిపత్రం ఇస్తున్నా నాయకులు, అధికారులకు ఈ పేద ప్రజలు కనబడలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో లత, రమీజా, వెంకటేశ్వర్లు, నరసింహ, హసీనా, మధు, హుస్సేన్, బాషా, పార్వతి, సరస్వతి, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలి

జమ్మలమడుగు రూరల్ : ఈ నెల 16న జరిగే గ్రామాల సమ్మెను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఆర్అండ్‌బి అతిథిగృహంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతి థులుగా సిపిఎం పట్టణ కార్యదర్శి జి ఏసుదాసు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌ఛార్జి పుష్పరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర చట్టం చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను ఇప్పుడొచ్చిన హిట్ అండ్ డ్రైవ్ కొత్త చట్టాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధింపులకు గురి చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రాష్ట్రాల హక్కులను హరించి వేస్తోందన్నారు. పుష్పరాజు, సిఐటియు, ఏఐటీయూసీ నాయకులు దాసరి విజయ్, ప్రసాద్, ఆదాము, దస్తగిరి ప్రసంగించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు సిపిఎం కమిటీ సభ్యుడు ఎ.వినయ్, నరేంద్రకుమార్, మున్నా, యోహాన్, మునుస్వామి పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు సాధ్యం కాదు

జమ్మలమడుగు రూరల్ : ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత ఓట్లను తొలగించడంలో కిందిస్థాయి అధికారులకు సాధ్యం కాదని జమ్మలమడుగు ఆర్‌డిఒ ఎ.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు నమోదైన ఓట్లను 2024 జనవరి 22న ఓటర్ జాబితాలో ప్రచురించారన్నారు. తర్వాత నమోదైన ఓట్లన్నీ ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. జమ్మలమడుగు నియోజవర్గంలో 2,40,238 మంది ఓటర్లు ఉన్నారని, అందులో ఏవైనా తొలగించాలంటే జిల్లా ఎన్నికల అధికారి అనుమతితోనే అది కూడా 0.1శాతం ఓట్లు మాత్రమే తొలగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎన్నికల అధికారులు షఫీ, మస్తాన్ వల్లి, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారంటీ'

జమ్మలమడుగు రూరల్ : భవిష్యత్తు తెలుగుదేశం పార్టీ దేనిని, ఏ ఒక్క కార్యకర్త నిరుత్సాహపడవద్దని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గండికోట, నర్సోజి కొట్టాల గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడులో సూపర్ సిక్స్ పేరుతో మినీ మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. జమ్మల మడుగు అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం గండికోట గ్రామంలో సర్పంచ్ కామాటి గురు ఈశ్వతోపాటు 30 కుటుంబాలను పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ప్రసాద్, శ్రవణ్, రఘు, ప్రసాదు, శేఖర్, సుబ్బరాయుడు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండలం పార్టీ బాధ్యులు నాగేశ్వర్‌రెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు, మల్లికార్జున, జనసేన పార్టీ నాయకులు అల్లం సూర్యరాయల్, వనం గురుకుమార్, సురేష్, నిఖిల్, రాయల్ కిరణ్, దువ్వూరు మురళి బ్రదర్స్ హరి రాయల్, నర్సోజు కొట్టాల గ్రామ నాయకులు లక్ష్మీనారాయణ, గురప్ప, బాల బుద్ధిరాజు, తిమ్మయ్య, భాస్కర్, పాల సుంకన్న, పాల ఎర్రన్న, చంద్ర, బాలస్వామి, గంగన్న, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు మునిసిపాలిటీ 31 వార్డ్ అయోధ్య నగర్‌లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేరువా నీలిమ, మేరువా కుమార్, మెరువా నరసింహ, మురళి, పట్టణ అధ్యక్షుడు జేబీవుల్లా, మాజీ కౌన్సిలర్ సీతారాంరెడ్డి, భరత్ రెడ్డి, రూరల్ మండలం కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్ రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షు రాలు భోగాల లక్ష్మీనారాయణమ్మ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

మైదుకూరు : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ఉండాలని పట్టణ సిఐ మస్తాన్ అన్నారు. మంగళవారం డిఎస్‌పి వంశీగౌడ్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆటో డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

డాక్టర్ అన్వర్‌కు నియామక పత్రం అందజేస్తున్న తులసిరెడ్డి

వైసిపి పాలనలో రాష్ట్రం అప్పులపాలు

ప్రజాశక్తి - వేంపల్లె

రామాయణాన్ని కట్టే, కొట్టే, తెచ్చే అని మూడు ముక్కల్లో చెప్పినట్లు జగన్ పాలనను అప్పులు ఫుల్, అభివృద్ధి నిల్, సంక్షోభంలో సంక్షేమం అని అనడం సమంజసమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం పోరుమామిళ్లకు చెందిన డాక్టర్ అన్వర్‌ను జిల్లా మైనార్టీ అధ్యక్షుడుగా నియమిస్తూ రాష్ట్ర మైనార్టీ సెల్ చైర్మన్ దాదాగాంధీ ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో తులసిరెడ్డి ఆ నియామక పత్రాన్ని డాక్టర్ అన్వర్‌ు అందజేశారు. వ్యవసాయ ప్రధానమైన మన రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు నిధులు లేక నీరసించి పోయినట్లు చెప్పారు. రోడ్ల పరిస్థితి కూడా చాలా అధ్వానంగా ఉందన్నారు. జగన్ పాలనలో సంక్షేమం మేడి పండు చందంగా ఉందని విమర్శించారు. కాంగ్రెసు పార్టీలో పదవులు పొందిన నాయకులు మైనార్టీల్లో, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల సానుకూలత వచ్చేలా విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని ట్రిపుల్‌ఐటి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంగులయ్య సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చెరుకాంపల్లెలో మంగళవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాతావరణంలో సంభవించే కాలుష్యంపై అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. చెరుకాంపల్లెలో 5 రోజుల నుండి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలోని ప్రజలకు పరిసరాలు శుభ్రంగా లేకపోతే వచ్చే రోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

జమ్మలమడుగు రూరల్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని శ్రీనివాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పొన్నతోట, నర్సోజి కొట్టాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ఈనెల 9 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే పొన్నతోట, నర్సోజి కొట్టాల గ్రామాల్లోని పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.మహమ్మద్ రసూల్, గ్రామ సర్పంచ్ నారాయణ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దువ్వూరు

ఈనెల18న అనంతపురం జిల్లాలో వైసిపి తలపెట్టిన సిద్ధం సభను విజయంతం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఈ సభను విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుండి అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఈ సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు తిరుపాలురెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి కానాల ఓబుల్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16 నుంచి శ్రీవేణుగోపాలకృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీ వేణుగోపాల కృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఈనెల 16 నుండి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు నాగిరెడ్డి తెలిపారు. గ్రామంలో నూతనంగా శ్రీకృష్ణాలయ దేవాలయం నిర్మించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మండలంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు మంజూరు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ నిధుల నుండి కొత్త కాంపిటేషన్ పుస్తకాలు మంజూరైనట్లు రికార్డ్ అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, భారతదేశ చరిత్ర, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, హైటెక్ విజయ రహస్యం, జాగ్రఫీ, ఇండియన్ పాలిటిక్స్, ఆంధ్రుల చరిత్ర, ఇండియన్ ఎకానమీ వంటి పుస్తకాలు వచ్చాయన్నారు. వివిధ ఉద్యోగ పరీక్షలకు పోటీ పడే అభ్యర్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం

సింహాద్రిపురం : డ్వాక్రా మహిళలకు సంబంధించిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో సల్మాన్ రాజ్, డిఆర్‌డిఎ ఏపీవో మంజునాథ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సింహాద్రిపురంలోని నూతన మార్కెట్ యార్డ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

21 వరకు పిఎం కిసాన్ పథకంపై గ్రామసభలు

ప్రజాశక్తి- ముద్దనూరు

పిఎం కిసాన్ పథకంపై గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని యామవరం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 వరకు ఆయా గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పిం కిసాన్, ఈకేవైసీకి సంబంధించి పెండింగ్ ఉన్న రైతులు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పిఎం కిసాన్ పథకం ద్వారా రూ.6వేలు లబ్ధి పొందాలని రైతులకు తెలిపారు. మండలంలో 44 మంది రైతులకు ఈకేవైసీసి పెండింగ్ ఉందన్నారు. ఎన్‌పిసిఐ 32 మంది రైతులకు పెండింగ్ ఉందన్నారు. వీరికి గ్రామ సభల ద్వారా అవగాహన కల్పించి పథకం వర్తించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **BASEDDULA NAGAIAH** (Old Name) S/o B.Swami dasu Resident of D.No. 5/100-B-56, Near S.P.G Church, Muddanur Town, Muddanur Mandal of YSR Kadapa Dist, A.P., here by declare that I have changed my name as **BASEDDULA PUSHPARAJU** (new name), for all purposes.

CHANGE OF NAME

I, Kanakanti Jasvitha M/o Malluru Lakshmi Devi, R/o D.No: 58/348-13, Akkayapalli, Kadapa, Y.S.R. Kadapa District, A.P., now my name changed from K.Jahnavi to **KANAKANTI JASVITHA** (New Name).

CHANGE OF NAME

I, Kanakanti Vidyyaa Akshaya M/o Malluru Lakshmi Devi, R/o D.No: 58/348-13, Akkayapalli, Kadapa, Y.S.R.Kadapa District, A.P., now my name changed from K.Vaishnavi to **KANAKANTI VIDYYAA AKSHAYA** (New Name).